క్లుప్తంగా

చెవిరెడ్డి వెంటే మేమంతా



చెవిరెడ్డి లక్ష్మిని సత్కరిస్తున్న దీపశ్రీ

తిరుపతి రూరల్ : మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఆయన కుటుంబం వెంటే ఎప్పటికీ ఉంటామని వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా మహిళా విభాగ కమిటీ కార్యవర్గ సభ్యులు దీపశ్రీ తెలిపారు. మంగళవారం తుమ్మలగుంటలోని చెవిరెడ్డి నివాసానికి ఆమె వెళ్లారు. చెవిరెడ్డి సతీమణి లక్ష్మిని కలిసి శాలువతో సత్కర్కించారు. భాస్కర్‌రెడ్డి సిఫార్సు కారణంగానే తనకు మహిళా విభాగం కమిటీలో పదవి వచ్చిందని కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సప్తగిరి కాలనీ పంచాయతీ మహిళా విభాగం అధ్యక్షులు మంజుల, వార్డు సభ్యులు వెంకట సుబ్బమ్మ, కవిత, జ్యోతి పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



ఆలయ శుద్ధి చేస్తున్న అధికారులు, అర్చకులు

తిరుపతి కల్చరల్ : అలిపిరి పాదాల మండపంలోని ఆలయాల్లో మంగళవారం శాస్త్రోక్తంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించారు. నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, కర్పూరం, గంధం, కుంకుమ తదితర సుగంధ ద్రవ్యాలు కలిపిన పవిత్ర జలాలతో ఆలయాల్లో ప్రోక్షణం చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. డిప్యూటీ ఈఈ వీఆర్ శాంతి, ఏఈఈ ఎ.భాస్కర్ నారాయణ్ చౌదరి పాల్గొన్నారు.

బీజేపీ చంద్రగిరి మండలాధ్యక్షుడిగా మునిరాజా



సమావేశం నిర్వహిస్తున్న నేతలు

చంద్రగిరి : బీజేపీ చంద్రగిరి మండల అధ్యక్షుడిగా కాకిమాను మునిరాజ ఎన్నికయ్యారు. మంగళవారం ఓ ప్రైవేటు హోటల్‌లో నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి టీడీ వరప్రసాద్ నేతృత్వంలో మునిరాజాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. నేతలు సుబ్రమణ్య యాదవ్, ముని గంగిరెడ్డి, వెంకటముని, సునీల్ యాదవ్. సంగీతం దొరస్వామి, ప్రసాద్, ఇందు శేఖర్, గురవయ్య, లక్ష్మయ్య, రాణి, ప్రశాంతి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి

తిరుపతి సిటీ : ఎస్వీయూ భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలు అనే అంశంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సౌత్ కొరియా యాగ్నం వర్సిటీ ప్రొఫెసర్ వాసుదేవరెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుత విద్యావ్యవస్థ ద్వారా ప్రతిభగల విద్యార్థులకు దేశ, విదేశాలలు సుర్ణావకాశాలు ఉన్నాయన్నారు. అకడమిక్ విద్యతో పాటు నెట్, గేట్, స్లెట్ వంటి పోటీ పరీక్షలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచి!



భవానీనగర్‌లో చంద్రబాబు మోసాలను వివరిస్తున్న అభినయ్‌రెడ్డి తదితరులు

"ఓట్ల కోసం నోటికొచ్చిన అబద్ధాలను చంద్రబాబు నిస్సంకోచంగా చెప్పేశారు. నిజంగా మారానని మొసలికన్నీరు కార్చారు.. జగనన్న కంటే రెండింతల సంక్షేమ ఫలాలు అందిస్తామని ఊదరగొట్టారు.. మాది గ్యారంటీ అంటూ బాండ్లు కూడా ఇంటింటికీ పంపిణీ చేశారు.. అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కేశారు.. నమ్మిన ప్రజలను నట్టేట ముంచేశారు. ఏడాది పాలనలో ఊకదంపుడు ఉపన్యాసాలు మినహా ఒక్క పథకం కూడా అమలు చేయకుండా జనాలకు కుచ్చు టోపీ పెట్టేశారు'' అంటూ కూటమి మేనిఫెస్టో మోసాలను వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి క్షేత్రస్థాయిలో నగరవాసులకు వివరించారు.

- సూపర్ సిక్స్ పేరుతో చంద్రబాబు వంచించారు
- ఎన్నికల హామీలన్నీ తుంగలో తొక్కేశారు
- రెండింత సంక్షేమం ఇస్తామని ప్రజలకు టోపీ పెట్టేశారు
- కూటమి మేనిఫెస్టో మోసాలను వివరించిన అభినయ్‌రెడ్డి

తిరుపతి మంగళం : నగరంలోని 12, 13, 25, 48వ డివిజన్లలో రీకాల్ చంద్రబాబు మోసాల మేనిఫెస్టో కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి మంగళవారం చేపట్టారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయా డివిజన్లలో ఇంటింటికీ వెళ్లారు. ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలన్నీ అమలు అవుతున్నాయా..? సూపర్‌సిక్స్‌లో తల్లికి వందనం, ఆడబిడ్డ నిధి, యాభై ఏళ్లు నిండిన మహిళలకు పెన్షన్, యువతకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు వంటి సంక్షేమ పథకాలు వస్తున్నాయా? అక్కా అంటూ ఆరా తీశారు. అభినయ్‌రెడ్డితో నగరవాసులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చి వెళ్లారే తప్ప ఇంతవరకు మీ సమస్యలేంటి?, మీకు సంక్షేమ పథకాలు వస్తున్నాయా? అంటూ ఎవరూ అడగలేదయ్యా అంటూ వాపోయారు. ఓడిపోయినా మీరొచ్చి మా బాగోగులు తెలుసుకుంటున్నారే కానీ,, కూటమి నేతలు రావడంలేదని, వస్తే వారి చొక్కాలు పట్టుకుని నిలదీస్తామని మండిపడ్డారు. గత ఎన్నికల్లో చంద్రబాబు మాటలను నమ్మి మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ సంక్షేమ పథకాలు అందిస్తానంటూ మోసం చేశాడని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలం అవుతున్నా చంద్రబాబు ఇచ్చి హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదంటూ తేల్చి చెప్పారు. కోవిడ్ కష్టాల్లో సైతం అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించిన జగనన్నను మోసం చేసినందుకు తమకు తగిన శాస్తి జరిగిందని పశ్చాత్తాపం వ్యక్తం చేశారు.

ఒక్కో ఇంటికి రూ.లక్షల్లో మోసం

ఎన్నికల సమయంలో చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టో ప్రకారం 13నెలలకు గానూ ఒక్కో ఇంటికి రూ. లక్ష నుంచి రూ. 2లక్షల వరకు ప్రజలకు లబ్ధి చేకూరాల్సి ఉందని, అయితే ఒక్క రూపాయి కూడా అందించకుండా మోసం చేశారని భూమన అభినయ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే దురుద్దేశంతోనే నోటికి వచ్చిన హామీలు గుప్పించారని ఆరోపించారు. ఇప్పటి వరకు మూడు పర్యాయాలు అధికారంలోకి వచ్చినా ఏనాడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను చంద్రబాబు నెరవేర్చలేదని తెలిపారు. కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఏడాది పాలనలో ఏదో ఉద్ధరించినట్లు తొలిఅడుగు పేరుతో ప్రజల వద్దకు వస్తున్నారని, అయితే వారేం చేశారో నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, కార్పొరేటర్లు కోటూరు ఆంజి



13వ డివిజన్‌లో..

నేయులు, తమ్ముడు గణేష్, నేతలు వాసుయాదవ్, తలారి రాజేంద్ర, నవీన్ బ్రుంగీ, దినేష్‌రాయల్, సోమశేఖర్‌రెడ్డి, పడమటి కుమార్, సాకం ప్రభాకర్, కడపగుంట అమరనాథరెడ్డి, మురళి, హరి, చందూ రాయల్, కిషోర్‌రెడ్డి, మునిలక్ష్మి , మాదురి, పద్మ, మణికంట, ఆటో ప్రసాద్, జీవకోన రెడ్డెప్ప, కవితమ్మ, శారద, వంశీ, కిరణ్, మదన్, దుర్గ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- కరకంబాడిలోని అమరరాజా ఆడిటోరియంలో ఉదయం 9.30 నుంచి పోలీసు సిబ్బందికి ఉచిత మెగా వైద్యశిబిరం.
- శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో సాయంత్రం 5.30 నుంచి 6.30 గంటల వరకు ఆణివార ఆస్థానం.
- శ్రీకోదండరామాలయంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆణివార ఆస్థానం.
- తిరుచానూరులోని శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటలకు తిరుచ్చిపై స్వామివారి ఊరేగింపు.
- తిరుచానూరులోని శ్రీసుందరరాజస్వామి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు తిరుచ్చి ఉత్సవం.

మూడేళ్లుగా నిలిచిన 'కాన్వొకేషన్'

తిరుపతి సిటీ: ఎస్వీయూలో మూడు ఏళ్లుగా కాన్వొకేషన్ ప్రక్రియను చేపట్టకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. 2022 తర్వాత కాన్వొకేషన్‌పై అధికారులు శీతకన్ను వేశారు. విద్యార్థులు మాత్రం కాన్వొకేషన్ నిమిత్తం ఏటా రూ.3వేల ఫీజుల చెల్లిస్తున్నారు. కాన్వొకేషన్ సర్టిఫికెట్‌ను విద్యార్థుల ఇంటికే పంపుతామని చెప్పిన అధికారులు ఊసే మరిచిపోయారు. దీంతో యూజీ, పీజీ పూర్తి చేసుకుని ఇతర ప్రాంతాలలో ఉపాధి, ఉన్నత చదువుల కోసం వెళ్లిన విద్యార్థులు వర్సిటీ ఉద్యోగులకు లంచాలు చెల్లించి సర్టిఫికెట్లు పొందుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ ఏడాదైనా కాన్వొకేషన్ ప్రక్రియను వర్సిటీ అధికారులు చేపట్టాలని విద్యార్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వినాయకసాగర్ అభివృద్ధికి ప్రాధాన్యం



స్విమ్మింగ్ పూల్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే, కమిషనర్

తిరుపతి తుడా : వినాయక్‌సాగర్ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తున్నామని, ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపట్టామని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. మంగళవారం ఈ మేరకు రూ.3.30కోట్లతో నిర్మించిన స్విమ్మింగ్ పూల్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్యతో కలసి ఆయన ప్రారంభించారు. అలాగే వాకర్స్ కోసం ఆప్కాస్ సంస్థ ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంటును అందుబాటులోకి తీసుకువచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ స్మార్ట్ సిటీ మిషన్‌లో భాగంగా స్విమ్మింగ్ పూల్ నిర్మాణంతో పాటు రూ.17.95 లక్షల వ్యయంతో టాయిలెట్స్ నిర్మించామన్నారు. ఈ క్రమంలోనే పిల్లలు, పెద్దలకు వేర్వేరుగా పూల్ ఏరియాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 20 రోజుల్లో స్విమ్మింగ్ పూల్ నిర్వహణకు టెండర్ పిలవనున్నట్లు తెలిపారు. అలాగే ప్రొఫెషనల్ కోచ్‌లను నియమించనున్నట్లు స్పష్టం చేశారు.

ఘనంగా 'నైపుణ్య దినోత్సవం'



కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

పాకాల : మండలంలోని మొగరాల జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం ఘనంగా ప్రపంచ యువత నైపుణ్య దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయుడు వనపర్తి వెంకటసిద్ధులు ఆధ్వర్యంలో హెచ్‌ఎం సుమలత సమక్షంలో కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులు చదువుతోపాటు వృత్తి విద్యలను నేర్చుకుంటే ఉపాధి అవకాశాలను అధికంగా పొందవచ్చని సూచించారు. ఉపాధ్యాయులు సుల్తాన్, విమాల విక్టోరియా, శైలజ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం పట్టని ప్రభుత్వం



ధర్నా చేస్తున్న చింతా మోహన్ తదితరులు

తిరుపతి కల్చరల్ : మత రాజకీయాలు తప్ప బీజేపీ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమం పట్టదని కేంద్ర మాజీ మంత్రి, చింతామోహన్ విమర్శించారు. మంగళవారం టీటీడీ పరిపాలన భవనం వద్ద ధర్నా చేపట్టారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ టీటీడీలో వెయ్యి మంది అన్య మతస్తులు ఉన్నారనడం సరికాదన్నారు. తిరుమలలో సుమారు 5వేల మంది అన్యమతస్తులు ఉన్నారని, కొండపై పారిశుద్ధ్య పనులు చేస్తున్నారని వెల్లడించారు. భక్తుల మల, మూత్రాలను కడిగి శుభ్రం చేస్తున్న వారిని తొలగించే దమ్ముందా అని ప్రశ్నించారు. ఎన్‌డీఏ పాలనలో రూ.లక్ష కోట్ల అవినీతి జరిగిందని, బండి సంజయ్‌కు నిజాయితీ ఉంటే దానిపై స్పందించాలని డిమాండ్ చేశారు. తిరుమలలో ఎస్సీ, బీసీలకు ఒక్క దుకాణం కూడా ఇవ్వలేదని, దళిత అధికారిని నియమించలేదని, దీనికి సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపీగౌడ్, రవి, తేజోవతి, ముని శోభ, బాల గురవయ్య పాల్గొన్నారు.

బహిరంగ వేలం రేపు

పాకాల : ఆడికృత్తి సందర్భంగా తలనీలాలు, పాదరక్షలు భద్రపరచడం, కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కులు పొందుటకు సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలో గురువారం బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.యువరాణి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఆగస్టు 13 నుంచి 17వ తేదీ వరకు ఆడికృత్తిక బ్రహ్మోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే ఈ వేలంలో పాల్గొనదలచిన వారు రూ.వెయ్యి డిపాజిట్ చెల్లించాలని, తలనీలాల వేలం పాటదారులు మాత్రం రూ.10వేలు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని వివరించారు. వేలం ముగిసిన వెంటనే పాట దక్కించుకున్నవారు మొత్తం నగదును చెల్లించాలని స్పష్టం చేశారు.

పేకాట దందాపై చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : మండలంలో జోరుగా సాగుతున్న పేకాట దందాపై పోలీసు ఉన్నతాధికారులు స్పందించారు. సాక్షి దినపత్రికలో సోమవారం 'జోరుగా పేకాట దందా' అన్న శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఈ దందాకు ఓ చిరుద్యోగి (హోంగార్డు) సహకరిస్తుడనే ఆరోపణలపై పోలీసు ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. సదరు హోంగార్డును జిల్లా కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఎక్కడైనా పేకాట ఆడితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ప్రతిష్టాత్మకంగా మహాసభలు



మాట్లాడుతున్న మురళి

తిరుపతి కల్చరల్ : సీపీఐ శతవసంతాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా తిరుపతిలో నిర్వహించనున్న నగర మహాసభలను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని పార్టీ జిల్లా కార్యదర్శి పి.మురళి పిలుపు నిచ్చారు. మంగళవారం సీపీఐ కార్యాలయంలో ముఖ్య నేతలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, అధిక ధరలు, నిరుద్యోగం, మహిళలపై దాడులు, ఆత్మహత్యాలు పెరిగిపోతున్న తరుణంలో ప్రజలను చైతన్యవంతం చేసేందుకు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్రం, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వాలు పూర్తిగా వైఫల్యాం చెందాయని ఆరోపించారు. సీపీఐ నేతలు కేవై రాజా, రాధాకృష్ణ, బండి చలపతి, ఎన్‌డీ రవి, ప్రవీణ్, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మనాభరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, రత్నమ్మ పాల్గొన్నారు.

ఎస్వీయూ డ్రైవర్‌కు సత్కారం



మురుగనాయక్‌ను సన్మానిస్తున్న వీసీ

తిరుపతి సిటీ : ఏపీ ప్రభుత్వ వాహనాల డ్రైవర్స్ సెంట్రల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన ఎస్వీయూ డ్రైవర్ ఎస్.మురుగనాయక్‌కు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు అభినందనలు తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయనను ఘనంగా సత్కరించారు. వర్సిటీ నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్, సుబ్రమణ్యం, డ్రైవర్లు గంధం బాబు, వల్లీబాయ్, శంకర్‌రెడ్డి, మునీశ్వరయ్య గౌడ్, మురళి, చంద్రమౌళి, గుణాయాదవ్ పాల్గొన్నారు.

కళాశాలపై చర్యలకు వినతి



వీసీకి వినతి పత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలోని కేకేసీ విద్యా సంస్థపై చర్యలు చేపట్టాలని ఏపీ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్, బీసీ విద్యార్థి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ కోరారు. మంగళవారం ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడుకు వినతి ప్రతం సమర్పించారు. వారు మాట్లాడుతూ కేకేసీ సంస్థల యాజమాన్యం ప్రభుత్వాన్ని మోసం చేస్తూ ఒకే భవనంలో ఎంబీఏ, ఎంసీఏ, లా కోర్సులు నడుపుతోందని ఆరోపించారు. అలాగే ఎన్టీఆర్ యూనివర్సిటీకి సంబంధించిన కోర్సులను అనధికారంగా నిర్వహిస్తోందని, విద్యార్థులకు కనీస వసతులు కల్పించకుండా రూ.లక్షల ఫీజు వసూలు చేస్తోందని తెలిపారు. విద్యా ప్రమాణాలను తుంగలో తొక్కి వ్యాపార కేంద్రంగా మార్చిన కేకేసీ విద్యాసంస్థ గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నేతలు వెంకటేష్, ఉపేంద్ర పాల్గొన్నారు

క్షయ నివారణపై అవగాహన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారులు

చంద్రగిరి : టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా మంగళవారం కొటాల పీహెచ్‌సీ వైద్య సిబ్బంది బి.కొంగరవారిపల్లెలో గ్రామస్తులకు క్షయ నివారణపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ టీబీని ప్రారంభ దశలో గుర్తిస్తే సులువుగా నయం చేయవచ్చని తెలిపారు. టీబీ బాధితులను ఎలా గుర్తించాలనే విషయాలను వివరించారు. రోజుల తరబడి దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, బరువు తగ్గడం, శ్వాస తీసుకోవడం కష్టతరంగా మారడం తదితర లక్షణాలుంటే క్షయ వ్యాధిగా భావించవచ్చని వెల్లడించారు. అనంతరం అవగాహన పోస్టర్ ఆవిష్కరించారు. ఎంపీహెచ్‌ఓ ఈశ్వరయ్య, సూపర్‌వైజర్ రమణ, సర్పంచ్ లక్ష్మి పాల్గొన్నారు.

స్విమ్స్‌లో ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి తుడా : స్విమ్స్‌లోని పద్మావతి ఆడిటోరియంలో మంగళవారం ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డైరెక్టర్, వీసీ ఆర్‌వీ కుమార్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఏటా జూలై 15వ తేదీన ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం జరుపుకుంటామని, ఈ రంగంలో సాధించిన విజయాలు, వైద్యుల కృషి, ప్రాముఖ్యతను గుర్తుచేసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు రవీంద్రారెడ్డి, ప్రవీణ్, నాగరాజ్, శ్రీహరి, శరణ్ బి సింగ్, నరేంద్ర పాల్గొన్నారు

కార్మికులకు అండగా ఎర్రజెండా



సమావేశంలో మాట్లాడుతున్న రామానాయుడు

తిరుపతి కల్చరల్ : కార్మికుల అండగా ఎర్రజెండా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.రామానాయుడు స్పష్టం చేశారు. హమాలీ వర్కర్స్ యూనియన్ సీపీఐ శాఖ మహాసభను మంగళవారం లీలామహల్ సర్కిల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాతిరుపతి నగరం విస్తరణలో కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. నిరుపేదలకు ఇళ్ల స్థలాలు పంచిందని తెలిపారు. కార్యక్రమంలో హమాలీ వర్కర్స్ యూనియన్ నేతలు ఎన్‌డీ.రవి, బాబు, చిన్నబ్బ, చంద్ర, ఈశ్వరయ్య, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్, రాధాకృష్ణ, ఏఐటీయూసీ నేత చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజాధనం రోడ్డు పాలు



నాసిరకం తారుతో రోడ్డు నిర్మిస్తున్న దృశ్యం







నాణ్యత లేదని వెల్లడిస్తున్న వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, పలుచగా రోడ్డు లేయర్, రహదారి నిర్మించిన గంటల్లోనే కంకర తేలిన దృశ్యం

సాక్షి టాస్క్ ఫోర్స్ : రామానుజ కూడలి నుంచి రేణిగుంట వరకు నూతనంగా చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత కొరవడిందని వైఎస్సార్‌సీపీ తిరుపతి నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రా రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఈ మేరకు ఆయన బీటీ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎక్కడికక్కడ లోపాలను ఎత్తి చూపారు. రవిచంద్రారెడ్డి మాట్లాడుతూ బీటీ రోడ్డును నాసికరకంగా నిర్మిస్తున్నారన్నారు. ఆర్‌అండ్‌బీ ప్రమాణాలను తుంగలో తొక్కేశారని విమర్శించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపించిందని వెల్లడించారు. ప్రజాధనం దోచుకోవడమే లక్ష్యంగా కాంట్రాక్టు సంస్థ జేఎంసీ కన్‌స్ట్రక్షన్ ఇష్టారాజ్యంగా రోడ్డు నిర్మిస్తోందని స్పష్టం చేశారు. నాణ్యతలేని రహదారి పనులపై చట్టప్రకారం చర్యలు చేపడతామని హెచ్చరించారు. రోడ్డు నిర్మాణానికి వినియోగిస్తున్న తారు నాసిరకరంగ ఉందని, రోడ్డుపై వేయాల్సిన లేయర్ (మందం) మరీ పలుచగా ఉందని ఆరోపించారు. అవసరం లేని చోట కూడా బీటీ రోడ్డు వేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి బీటీ రోడ్డు నాణ్యతను నిబంధనల మేరకు తనిఖీలు చేయాలని డిమాండ్ చేశారు.